కంసాలిపాలెంలో డ్రోన్ సర్వే

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం కంసాలి పాలెం గ్రామంలో డ్రోన్ సహాయంతో మంగళవారం భూ సర్వేను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండ పల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మలిశెట్టి వీరప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు బెజవాడ నాగగంగాధర్, సచివాలయ కన్వీనర్ కొయి శ్రీనివాస్, నాయకులు ఉప్పాటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు భరోసాగా..

- రైతుభరోసా మూడో విడత నిధుల విడుదల
- నియోజకవర్గంలో 21,334 మందికి లబ్ధి
- రైతుల ఖాతాలకు రూ.4.27 కోట్లు జమ


వరి పంట నూర్పిడి చేస్తున్న రైతు కూలీలు (ఫైల్)

పెరవలి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ రైతు భరోసా పథకం అన్నదాతల కళ్లల్లో ఆనందాన్ని నింపుతోంది. కౌలు రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఈ పథకం ద్వారా గతేడాది నిడదవోలు నియోజకవర్గంలో 21,334 మంది రైతులు లబ్ధి పొందారు. ఈ ఏడాది పంట వేయకుండానే పెట్టుబడి సాయం కింద మే నెలలో మొదటి విడతగా రైతులకు రూ.16 కోట్లు, రెండో విడతగా రూ.8.53 కోట్లు జమ చేశారు. మూడో విడతగా రూ.రెండు వేల చొప్పున రూ.4.27 కోట్లు రైతుల ఖాతాల్లో మంగళవారం జమ అయ్యింది.

పెట్టుబడికి కొండంత భరోసా..

పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఏడాదికి రూ.13,500 చొప్పున అందిస్తున్నారు. ఈఏడాది మొదటి విడతగా కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.5500 మొత్తం రూ.7,500 రైతుల ఖాతాలకు మే నెలలోనే జమ చేశారు. రెండో విడతగా రూ.4 వేల చొప్పున జమ అయ్యింది. మూడో విడతగా రూ.2 వేల చొప్పున ప్రభుత్వం మంగళవారం జమ చేసింది.

సాగుకు ప్రోత్సాహం



రైతుభరోసా ద్వారా ప్రభుత్వం నుంచి అందే నగదు సాయం సాగు సమయంలో అక్కరకు వస్తోంది. రైతుల కష్టాలను గుర్తించి భరోసా కల్పించడం వల్ల ఎక్కువ మంది రైతులు ఇప్పటికీ వ్యవసాయం చేయగలుగుతున్నారు.

–మేడపాటి సూర్రెడ్డి, రైతు, అజ్జరం

జగన్ రైతు పక్షపాతి



రైతు భరోసా అమలుతో రైతు పక్షపాతిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారు. ఆయన చేస్తున్న సాయం రైతులకు వ్యవ సాయంపై మక్కువ కలిగేలా ఉంది. వ్యవసాయం దండగ కాదు, ఇదే ఆధారం అనే భరోసా కల్పించారు జగన్. ధన్యవాదాలు

–నిడదవోలు శ్రీనివాస్, రైతు, ముక్కామల

రైతు కళ్లలో ఆనందం చూశాను



జగన్ పాలనలో రైతుల కళ్లల్లో ఆనందాన్ని చూశాను. ప్రజల కోసం పనిచేసే నాయకుడి ప్రభుత్వంలో నేను భాగస్వామిగా పనిచేయటం చాలా ఆనందంగా ఉంది.

– జి శ్రీనివాస్ నాయుడు, ఎమ్మెల్యే, నిడదవోలు



విలియమ్స్ హో కు టైలర్ల నివాళి


అనంతపల్లిలో విలియమ్స్ హో చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న టైలర్లు

నల్లజర్ల: కుట్టుమెషీన్ సృష్టికర్త విలియమ్స్ హో జయంతిని పురస్కరించుకుని ప్రపంచ టైలర్ల దినోత్సవాన్ని మంగళవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. అనంతపల్లిలో టైలర్ల సంఘం అధ్యక్షుడు మీసాల అప్పారావు ఆధ్వర్యంలో విలియమ్స్ హోకు శ్రద్ధాంజలి ఘటించారు. సీనియర్ టైలర్ రాపాక దయారాజు పతాకాన్ని ఆవిష్కరించగా, ములగాల గోపి విలియమ్స్ హో చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తలారి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా గొటికల కృష్ణ, కార్యదర్శిగా ఏలూరు సత్యనారాయణ, కోశాధికారిగా ఎస్‌కే ఆలీషా ఎంపికయ్యారు. అలాగే పోతవరంలో టైలర్ల సంఘం అధ్యక్షుడు రావిపాటి జగదీష్ ఆధ్యక్షతన టైలర్స్ డే వేడుకలు జరిగాయి.

తాళ్లపూడి: మండల టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మదన గోపాలస్వామి ఆలయం వద్ద కుట్టుమెషీన్ సృష్టికర్త విలియం హో చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా టైలర్స్ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి వంబోలు పోసిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనారోగ్యంతో బాధపడుతున్న టైలర్ జి.రాముకు రూ.ఐదు వేల ఆర్థిక సాయం చేశారు.

గోపాలపురం: మండల టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు బేదంపూడి వెంకట్రావు ఆధ్వర్యంలో గోపాలపురంలో టైలర్లు విలియమ్స్ హో జయంతిని నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎస్‌కే సికిందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో అర్హులైన టైలర్లకు చేయూత అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పెరవలి: విలియమ్స్ హో జయంతి సందర్భంగా పెరవలి, కానూరు గ్రామాల్లో టైలర్లు కేక్ కట్ చేశారు. ర్యాలీలు చేశారు.కార్యక్రమంలో కానూరు, నడిపల్లి, మునిపల్లి, కోరుపల్లి, పెండ్యాల, పెరవలి, కొత్తపల్లి, నల్లాకుల వారిపాలెం గ్రామాల టైలర్స్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో చరణ్ ప్రాజెక్ట్‌కు ఫస్ట్ ప్రైజ్


రాష్ట్రస్థాయిలో గెలుచుకున్న బహుమతి, ప్రశంసా పత్రంతో చరణ్ సాయి, గైడ్ లక్ష్మీదీప

తాళ్లపూడి: అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.చరణ్ సాయి రూపొందించిన సైన్స్ నమూనా ప్రాజెక్ట్‌కు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడ లయోలా కళాశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌లో 52 నమూనా ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటిలో 'ఆటలాడుతూ గణితం నేర్చుకోవడం ఎలా?' అనే అంశంపై చరణ్‌సాయి రూపొందించిన నమూనా ప్రాజెక్ట్‌ను ప్రథమ బహుమతి లభించింది. ఉపాధ్యాయురాలు లక్ష్మీదీప గైడ్‌గా వ్యవహరించారు.ఈ క్రమంలో చరణ్‌సాయి రూపొందించిన సైన్స్ నమూనా ప్రాజెక్ట్ త్వరలో జాతీయ స్థాయిలో నిర్వహించే సైన్స్‌ఫేర్‌కు ఎంపికైంది. అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చరణ్‌ను అభినందించారు.



అలరించిన సైన్స్ దినోత్సవ ప్రదర్శన

పెరవలి: మండలంలోని ముక్కామల ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము తయారు చేసిన అనేక పరికరాలను ప్రదర్శించారు. వారికి ముగ్గులు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జి.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పోటీల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకత బయట పడుతుందన్నారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు.

నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీలు

దేవరపల్లి: నవ ధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు ప్రకృతి వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని యాదవోలు, చిన్నాయగూడెం గ్రామాల్లో మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు.కార్యక్రమంలో సర్పంచులు సున్నం వరప్రసాద్, డెక్కపాటి జ్యోతి రాణి, ప్రధానోపాధ్యాయులు శేషగిరి, సబ్ డివిజన్ యాంకర్ దోని కృపావతి, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములూరులో..

కొవ్వూరు: రబీ వరికోతల అనంతరం పొలంలో నవ ధాన్యాలు చల్లుకుంటే అవి భూమి సారవంతానికి ఉపకరిస్తాయని ఏవో గంగాధర్ సూచించారు. మండలంలో వేములూరు గ్రామంలో నవధాన్యాల సాగు ప్రాధాన్యతను వివరిస్తూ మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నవ ధాన్యాలు సాగు ద్వారా భూసారం పెరుగుతుందని, పచ్చిరొట్టను కలియ దున్ను కోవడం ద్వారా భూమికి సారవంతం అవుతుందన్నారు . వేములూరు సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, సచివాలయ, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.





నేడు యాదవోలులో ధ్వజస్తంభాల ప్రతిష్ఠ

దేవరపల్లి: యాదవోలులోని మదన గోపాలస్వామి, లక్ష్మీగణపతిస్వామి వారి దేవస్థానాల్లో బుధవారం ఉదయం 7.30 గంటలకు జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పవన్ సాయికుమార్ శర్మ, శ్రీరంగసాయిసుధాకరాచార్యుల ఆధ్వర్యంలో నిత్యహోమాలు, పూజలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి భారీ అన్నసమారాధన చేస్తారన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా శంకర్ రాజా



కొవ్వూరు: మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా కరుటూరి శంకర్‌రాజా నియమితులయ్యారు.ఇప్పటి వరకూ పనిచేసిన వీఎస్ మునేశ్వరరావు ఆ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఈనెల 27న నిర్వహించిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో శంకర్‌రాజాను స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎంపిక చేస్తూ తీర్మానం చేశారు.

గ్రామ వలంటీర్లకు డివైజర్ల అందజేత



వలంటీర్లకు డివైజర్లు అందజేస్తున్న సర్పంచ్ బుల్లారావు

దేవరపల్లి: వైఎస్సార్ పింఛన్ల పంపిణీ వేగవంతం కోసం గ్రామ వలంటీర్లకు డివైజర్లు అందజేసినట్టు దేవరపల్లి గ్రామ సచివాలయ కార్యదర్శి ఎస్.రవికిషోర్ తెలిపారు. రామన్నపాలెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం సర్పంచ్ కూచిపూడి బుల్లారావు వలంటీర్లకు వాటికి అందజేసినట్టు ఆయన తెలిపారు. రామన్నపాలెంలో 8, కురుకూరులో 12, దేవరపల్లిలో 5 డివైజర్లను అందజేసినట్టు వివరించారు. ఒకొక్క డివైజరును రూ.27,000 రేటుకు పంచాయతీ నిధుల నుంచి కొనుగోలు చేసినట్టు రవికిషోర్ తెలిపారు. మార్చి ఒకటి నుంచి పింఛన్లు పంపిణీకి ఇబ్బంది లేకుండా డివైజర్లను అందజేసినట్టు తెలిపారు.

ముక్కామలలో 165 మందికి కంటి పరీక్షలు



కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెరవలి: లయన్స్ క్లబ్ పెరవలి శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ముక్కామల గ్రామంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిడదవోలుకు చెందిన రాజేశ్వరి లయన్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో రోగులకు సేవలు అందించారు. శిబిరంలో నేత్ర వైద్యులు 165 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 21 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని, మరో 27 మందికి కళ్లజోళ్లు వేయాలని నిర్ధారించారు. లయన్స్ క్లబ్ పెరవలి శాఖ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, క్లబ్ కార్యదర్శి సలాది ఉదయభాస్కరరావు, బోళ్ల మంగారావు, మాదిరెడ్డి బాబూరావు, అడపా బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



